

'పది' విద్యార్థులకు ఘన వీడ్కోలు



ఉపాధ్యాయులతో టెన్త్ విద్యార్థులు

ప్రజాశక్తి -దుంబ్రిగూడ: మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా హాజరై పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు, సిబ్బంది సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఐద్వా ఆధ్వర్యాన మహిళా దినోత్సవం



మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న జయ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని గిరిజన సంఘం భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు వివి జయ మాట్లాడుతూ అమెరికా చికాగో నగరంలో కుట్టు మిషన్లు పరిశ్రమలో శ్రామిక మహిళ పట్ల యాజమాన్యం పెట్టే హింసకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంతోపాటు మహిళలకు 12గంటలు నుంచి 8 గంటలకు పని వేళలు తగ్గించి పనికి తగ్గ వేతనం చెల్లించాలని, ఇతరత్రా డిమాండ్లతో చేపట్టిన ఆందోళనల్లో 146 మంది మహిళలు ప్రాణాలు కోల్పోయారన్నారు వీరి త్యాగాలను గుర్తించిన ఐక్య రాజ్య సమితి మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని తీర్మానించిందన్నారు. నేటికీ ఏటా మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నా, మహిళల హక్కుల రక్షణ, ఇతర సౌకర్యాల కల్పనకు నామమాత్రపు చర్యలే ప్రభుత్వాలు, పాలకులు తీసుకోవడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో పురుషులతో సమానంగా చదువులు, ఉద్యోగాలలో మహిళలు రాణిస్తున్నా, నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడే ఉన్నారని, ..కోట్లాది మంది శ్రామిక మహిళలకు ఏ విషయంలోనూ గుర్తింపు లేకపోవడం శోచనీయమన్నారు. మహిళా దినోత్సవాలను జరుపుకుంటూ, ఒకరిద్దరు మహిళలను సన్మానించే ప్రభుత్వాలు, పాలకులు మహిళలకు సంపూర్ణ సాధికారత, రక్షణ కల్పించి హింస లేని సమాజంలో పురుషులతో సమానంగా స్త్రీలకు సమానపనికి సమాన కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్,.ఆసో బ్యాంకు బోర్డు డైరెక్టరు జి.భాగ్యవతి మహిళా సంఘం మండల అధ్యక్షురాలు కె శశికళ, మాలతి, నిర్మల, చంప, రాధిక, వసంత తదితరులు పాల్గొన్నారు.

పలువురు మహిళలకు సత్కారం

జి.మాడుగుల : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఏపిఎం సుందరమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పలువురు మహిళలను సత్కరించారు.



కేక్ కట్ చేస్తున్న ఎపిఎం, మహిళా సమాఖ్య ప్రతినిధులు

రాజవొమ్మంగిలో....

రాజవొమ్మంగి : మహిళా సాధికారతకు స్ఫూర్తి అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని రాజవొమ్మంగి సీఐ బాజీలాల్, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ అన్నారు. మండలంలోని జడ్డంగి సచివాలయం వద్ద మంగళవారం మురళీకృష్ణ ఆధ్వర్యాన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ ప్రజా ప్రతినిధులు, మండలంలో పలు శాఖలలో పని చేస్తున్న మహిళా ఉద్యోగులతో తొలిత ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పీటిసి వడుగుల జ్యోతి, సర్పంచ్, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, జడ్డంగి పీహెచ్సీ వైద్యులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది, గ్రామ మహిళలు తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జర్రా రాజేశ్వరి, సర్పంచులు దాసరి నాగేశ్వరరావు, ఏ శుభలక్ష్మి, ఎస్ఐలు టిజి ఎస్ ప్రసాద్, షరీఫ్ పాల్గొన్నారు.



మహిళా అధికారులు, నేతలను సత్కరిస్తున్న సిఐ

కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర కీలకం

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ



ఎటిడబ్ల్యుఒ రజినిని సన్మానిస్తున్న పిఒ, ఎస్పి, డిఇఒ, తదితరులు,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సమాజంలో కుటుంబ అభివృద్ధికి మహిళలు నిరంతరం శ్రమిస్తున్నారనిఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో స్థానిక కాఫీ హౌస్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరై మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చర్యలు చేపడుతున్నాయని, అందులో భాగంగానే దిశ, నిర్భయ, పోస్కో వంటి అనేక చట్టాలను అమలు చేస్తున్నాయన్నారు. గిరిజన మహిళలు అనాదిగా కుటుంబం పట్ల చాలా బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. మహిళలు పొదుపుకు చిహ్నంగా నిలుస్తారని, ఏజెన్సీలో 14 వేల స్వయంసహాయ సంఘాలున్నాయని,చెప్పారు. సమాజంలో మహిళపట్ల ఆలోచనా విధానంలో మార్పు రావాలని అన్నారు. ఆడ, మగ అనే వివక్ష లేకుండా ఇద్దరూ సమానమేనన్న దృక్పథం, మహిళలను గౌరవించడం నేర్చుకోవడం అవసరమన్నారు.

జాతి అభివృద్ధికి మహిళల విద్య దోహదం: ఎస్పి.

మహిళల విద్య జాతి అభివద్ధికి దోహదపడుతుందనిజిల్లా ఎస్పి సతీష్‌కుమార్ అన్నారు. కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థపై అవగాహన ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎన్.సూర్యలక్ష్మి, డిఇఒ డాక్టర్ పి.రమేష్, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, సిడిపిఒ పి.ఝాన్సీరాణి, ఇన్‌ఛార్జి డిఎంహెచ్ ఒ భారతీకుమారి, డాక్టర్ కె.హిమబిందు, వి.రమణి కుమారి, ఎం.గంగా భవానీ పలువురు సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో మండల కేంద్రాల్లో...

జిఒ3 చట్టబద్ధతకు ధర్నాలు

- 'దేశానికి మోదాని ముప్పు' పుస్తకావిష్కరణలో సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పలనర్స
- ప్రశ్నిస్తే ప్రభుత్వ వేధింపులు దుర్మార్గం
- ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆందోళనకు మద్దతు



'దేశానికి మోదానీ ముప్పు' పుస్తకావిష్కరణలో అప్పలనర్స

ప్రజాశక్తి పాడేరు : జిఒ 3ను పునరుద్ధరించి, దానికి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9,10తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ కార్యదర్శి పిఅప్పలనర్స వెల్లడించారు. మంగళవారం పాడేరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 'దేశానికి మోదాని ముప్పు' అనే పుస్తకాన్ని పార్టీ పాడేరు మండల కార్యదర్శి ఎల్. సుందరరావు, మండల నాయకుడు డి.బొజ్జన్నతో కలిసి ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ జిఒ3 రద్దుతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర అన్యాయం చేసిందని, దీన్ని పునరుద్ధరించాలని రెండున్నరేళ్లుగా గిరిజన సలహామండలిలో తీర్మానించడంతోపాటు పలు రూపాల్లో ఆందోళనలు, నిరసనలు చేపడుతున్నా గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఇతర నేతల అసమర్థత, నిర్లక్ష్యం వల్ల కార్యరూపం దాల్చడం లేదన్నారు. ఫలితంగా విద్య, ఉద్యోగాల్లో మన్యవాసులకు నష్టం జరుగుతోందన్నారు. జాబ్ కేలండర్ ప్రకటించక, ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయక నిరుద్యోగ గిరిజన యువతను రాష్ట్ర ప్రభుత్వం మోసపుచ్చుతోందన్నారు. వీటన్నింటికీ నిరసనగా, ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలను ఎండగట్టేందుకు మండల కేంద్రాల్లో నిర్వహించే ధర్నాలు, నిరసనల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
తమ హక్కులు, డిమాండ్ల సాధనకు, హామీల అమలుకు ప్రశ్నించి ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం వేధింపులు మానుకోవాలన్నారు. ఏడాదిగా ప్రతినెలా, సకాలంలో జీతాలు చెల్లించే పరిస్థితి లేదని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ మడమ తిప్పారని మండిపడ్డారు. ఆఖరుకు ఉపాధ్యాయుల పిఎఫ్ ఖాతాల్లోని నిధులను కూడా మళ్లించి, వారు అవసరాలకు రుణాలకు దరఖాస్తు చేసుకుంటే ఇవ్వలేని దుస్థితి కల్పించడం దారుణమన్నారు. . ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఎస్‌సిఆర్‌టి డైరెక్టరు ప్రతాపరెడ్డి. కడప ఆర్‌జెడి సహా కొందరు ఉన్నతాధికారులు ఎన్నికల్లో నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం కట్టడి చేయలేకపోతోందంటే, లోపాయికారీగా వారిని ప్రోత్సాహించడమేనని విమర్శించారు. మరోవైపు తమ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న, పోరాడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులపై తీవ్ర నిర్బంధం, అణచివేతతో మానసిక వేదనకు గురిచేయడం షోకాజ్ నోటీసులకు బెదిరింపులకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఏజెన్సీలో ప్రతిపాదించిన హైడ్రోపవర్ ప్రాజెక్టులను వద్దంటూ గిరిజనులు ఆందోళన చేస్తుంటే, మరోవైపు విశాఖలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో గ్రీన్ ఎనర్జీ పేరుతో పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించడం దారుణాతి దారుణమన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం మనోభావాలను, గౌరవిస్తామని గొప్పగా చెప్పిన సిఎం జగన్ రెడ్డి, నేడు గిరిజన ప్రాంతాల్లో సహజ వనరులను దోచిపెట్టె విధానాలను అమలు చేయడం మోస పూరితమని అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు పై ఒప్పందం ప్రక్రియను నిలుపుదల చేయాలని ప్రభుత్వంనికి డిమాండ్ చేశారు

సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా పరీక్షలు / ఇక నుంచి పాడేరు ఆసుపత్రిలోనే...

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలో సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా పరీక్షలు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోనే చేయటానికి అన్ని చర్యలు తీసుకున్నారు. ఆయా పరీక్షలకు విశాఖపట్నం కెజిహెచ్‌కు పరుగులు తీసే ఇబ్బందులకు అధికారులు చెక్ పెట్టారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ జిల్లా ఆసుపత్రికి జిల్లాలో సికిలిసెల్ ఎనీమియా, తలసేమియా పరీక్షలకు అవసరమైన మెషినరీ, రిఏజంట్స్, మౌలిక సదుపాయాలు అందించారు. దీంతో జిల్లా కేంద్ర ఆసుపత్రిలోనే స్క్రీనింగ్ నుండి కన్ఫర్మేషన్ వరకు పూర్తి స్థాయి పనులు నిర్వర్తించే అవకాశం కలిగింది.

మంగళవారం జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి గోపాలకష్ణ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆయా పరీక్షల ట్రయిల్ రన్‌ను ప్రారంభించారు. ప్రతి రోజు కనీసం 50 శాంపిల్స్ సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి ఎటువంటి సహాయం అవసరమైన పోన్ కాల్ దూరంలోనే ఉంటానని, ఏ సమయంలోనైనా కాల్ చేసి మాట్లాడవచ్చని డాక్టర్లకు సూచించారు. జిల్లాలో నాలుగు కేటగిరీల వారిని ప్రాధాన్యతగా గుర్తించటానికి బృందాలను ఏర్పాటు చేసారు. చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలను తొలి ప్రాధాన్యతగా గుర్తించి పరీక్షలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఇప్పటివరకు 2,170 మంది ని స్క్రీనింగ్ పరీక్షకు గుర్తించారు. అనంతరం ఆసుపత్రిలోని జనరల్ వార్డులను తనిఖీ చేసిన కలక్టర్, పిఒ రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీసారు. ఎన్ఆర్‌సిలో పర్యటించి పసిపిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, శిశు మరణాలు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ కృష్ణారావు, పేథాలజిస్ట్ డాక్టర్ రూపకళ, జనరల్ సర్జన్ డాక్టర్ రవి కిరణ్, హెడ్ నర్స్, తదితర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన



సీలేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి -సీలేరు
పాడేరు సబ్ కలెక్టరు అభిషేక్ జీకే.వీధి మండలంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా జీకే వీధి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ బూతును పరిశీలించారు. అనంతరం సీలేరు చేరుకుని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం నోడల్ అధికారిగా తనను నియమించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో జీకే వీధి మండలంలో జీకే వీధి, సీలేరు పోలింగ్ బూతులలో అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీలు చేసినట్లు చెప్పారు. సీలేరు పోలింగ్ బూతులో చిన్నచిన్న రిపేర్లు తప్ప ఇతర సమస్యలు ఏమీ లేవని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.చాణిక్యరావు, ఎన్ఆర్ఇజిఎస్ ఏపీఓ ఎల్.రాములు, జీకే వీధి తహశీల్దార్ జి.రాజ్ కుమార్, ఆర్ఐ మహదేవ్, వీఆర్వో శ్రీనివాస్, సీలేరు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీస్ రేవతి ఉన్నారు.

మినీ బస్ డిపో ఏర్పాటుకు స్థల పరిశీలన

జీకే వీధి మండలం సీలేరులోని శివాలయం వీధి చివర గ్యాస్ గోడౌన్ సమీపంలో మినీ బస్ డిపో ఏర్పాటు చేయడానికి గతంలో సర్వే చేసిన స్థలాన్ని మంగళవారం పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పడిన నేపథ్యంలో ఈ ప్రాంతానికి అదనంగా బస్సులు ఏర్పాటు చేయడం కోసం మినీ బస్సు డిపో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్త బస్సులు ఈ ప్రాంతానికి రెండు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడున్న ఐదు ఎకరాల స్థలంలో మూడు ఎకరాలు బస్ డిపోకు, కాంప్లెక్స్‌కి కేటాయించి మిగతా రెండు ఎకరాలు ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని వెల్లడించారు. బస్ డిపో మ్యాప్‌ని సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రసవం


ప్రజాశక్తి-మారేడుమిల్లి
పురిటి నొప్పులు పడుతున్న గర్భిణిని ఆటోలో ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో మండలంలోని పొట్లవాడ జంక్షన్ వద్ద మంగళవారం ప్రసవం జరిగింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. జిల్లాలోని కొయ్యూరు మండలం బొడ్డు మలక గ్రామానికి చెందిన గర్భిణి కడబాల కనకమ్మకు మంగళవారం ఇంటి దగ్గర పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆటో మీద మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొస్తున్న సమయంలో పురిటి నొప్పులు అధికమై మార్గమధ్యలో పొట్లవాడ జంక్షన్ వద్ద ప్రసవించడం జరిగింది. ముందుగానే 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మారేడుమిల్లి 108 సిబ్బంది సమయానికి చేరుకొని తల్లి బిడ్డను పరీక్షించి వారు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. వారిని వెంటనే దగ్గరలోని బోదులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ చేశారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది వెంకట్, బి.ధనుంజయ్ పాల్గొన్నారు.



పుట్టిన బిడ్డను 108లోకి ఎక్కిస్తున్న దృశ్యం

గాయపడిన చుక్కల జింక మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
మండలంలోని సింగంపల్లి గ్రామం సమీపంలో వేటగాళ్లు వేసిన ఉచ్చులో పడి తీవ్రంగా గాయపడిన చుక్కల జింక మంగళవారం మృతి చెందినట్లు స్థానిక అటవీ శాఖ రేంజర్ ఎం అబ్బాయిదొర తెలిపారు. ఆదివారం ఉచ్చులో పడి తీవ్రంగా గాయపడిన చుక్కల జింకకు ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది చికిత్స అందజేశారు. నడుము వద్ద తీవ్ర గాయం అవ్వడంతోనే చుక్కలు జింక మృతి చెందిందని రేంజర్ తెలిపారు. మృతి చెందిన జింక కళేబరాన్ని అటవీ ప్రాంతంలో ఖననం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కె బాలాజీ, ఎఫ్‌బిఓ కె అప్పారావు, పశువైద్యాధికారి తరుణ్, పశు వైద్య సిబ్బంది, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



మృతి చెందిన చుక్కల జింకకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్యుడు

గోదావరి డెల్టాకు 4,309 టిఎంసిల నీరు విడుదల


ప్రజాశక్తి-మోతుగూడెం
గోదావరి డెల్టాకు ఇప్పటి వరకు 4,309 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గత నెల 17 నుండి ఈ నెల 8వ తేదీ వరకు ప్రతిరోజూ పవర్ కెనాల్ ద్వారా 4300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, ఇరిగేషన్ అధికారుల అభ్యర్థన మేరకు అదనంగా డొంకరాయి డ్యాం నుండి 6, 7 గేట్ల ద్వారా మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈనెల మార్చి 31 వరకు నీటిని విడుదల చేయమని అభ్యర్థించారని, ఏపీ జెన్కో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం డొంకరాయి డ్యాంలో నీటిమట్టం 1008.7 అడుగులు ఉందని వెల్లడించారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

25 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-మోతుగూడెం
చింతూరు సిఐ ఎం.అప్పల నాయుడు పర్యవేక్షణలో మోతుగూడెం ఎస్ఐ వి.సత్తి బాబు సిబ్బందితో కలిసి లక్కవరం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, 25 కేజీల గంజాయి పట్టుబడింది. అటుగా వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా, ఒడిశా రాష్ట్రం కెందుగూడ గ్రామం నుండి మధ్యప్రదేశ్ భోపాల్‌కు 2 ప్లాస్టిక్ మూటల్లో ఈ గంజాయిని గుర్తించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.7,50,000 ఉంటుంది. మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు, డొంకరాయి గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేశారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒక వ్యక్తి పరారీలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ పట్టభి రామయ్య, హెడ్ కానిస్టేబుల్ సత్తిబాబు, కానిస్టేబుళ్ల సన్యాసిరావు, మురళీకృష్ణ, శివ ప్రసాద్, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణ సర్టిఫికెట్లు చూపుతున్న గిరిజన యువత

సిరామిక్ పాట్ ఫిల్టర్ తయారీపై శిక్షణ

ప్రజాశక్తి- అడ్డతీగల
సిరామిక్ పాట్ ఫిల్టర్ తయారీ, దానిని వాడే పద్ధతులపై లయ సంస్థ ఆధ్వర్యాన 20 మంది ఆదివాసీ యువతకు ఆ సంస్థ శిక్షణా కేంద్రంలో ఈ నెల 2 నుండి 7వ తేదీ వరకు శిక్షణ ఇచ్చారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సునీల్, సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధి లలిత్ శర్మ మాట్లాడుతూ రెండో విడత శిక్షణ ఈ నెల చివరిలో ఒక వారం రోజులు పాటు ఉంటుందని చెప్పారు. రెండో దశ శిక్షణ అనంతరం ఈ సిరామిక్ పాట్ ఫిల్టర్ తయారు చేసి అర్హులైన ఆదివాసీ ప్రజలకు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఫిల్టర్ ఖరీదు రూ.600 ఉంటుందని, ఇది మూడు సంవత్సరాల వరకు ఎటువంటి మెయింటెనెన్స్ లేకుండా పనిచేస్తుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

సమస్యలను ఎంపీ, ఎమ్మెల్యే పరిష్కరించాలి

ప్రజాశక్తి -సీలేరు
పాడేరు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత స్థానిక ఎంపీ జి.మాధవి, ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి ఉందని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మంగళవారం ఆమె చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశమయ్యారు. తమ గ్రామానికి సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని, మంచినీరు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నామని స్థానికులు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు రూ.1.50లక్షలు ఖర్చు చేసి పునాదులు నిర్మించుకుంటే ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని వెల్లడించారు. దీనికి ఈశ్వరి తమ ప్రభుత్వం అధికారంలో లేదని, ఈ సమస్యలను తీర్చవలసిన బాధ్యత ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి మాజీ జెడ్పిటిసి నళిని, టిడిపి నాయకులు నక్క హరిహర తిరుమలరావు, విష్ణు, చిటికెల రాము, చంద్రకళ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి మారేడుమిల్లి
మారేడుమిల్లి- చింతూరు ఘాట్ రోడ్డులో మంగళవారం ఉదయం భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. ఘాట్ రోడ్డులో భారీ లారీ నిలిచిపోవడంతో ఇరువైపులా వాహనాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజమహేంద్రవరం నుండి మారేడుమిల్లి మీదుగా చతీస్‌ఘడ్ వెళ్తున్న భారీ లారీ మండలంలోని వాలమూరు గ్రామం దాటిన తర్వాత ఏసుక్రీస్తు శిలువ మలుపు వద్ద సాంకేతిక లోపంతో అది నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు, ఆర్టీసీ బస్సులు సుమారుగా రెండు గంటల పాటు నిలిచిపోయాయి. దీనితో వాహన దారులు ప్రయాణికులు రోడ్డుపైనే పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడ్డారు. ఈ ఘాట్ రోడ్డులో భారీ వాహనాలు అనేకసార్లు అనేక ప్రమాద గురవుతున్నా సంబంధిత అధికారులు, ఇటువంటి భారీ వాహనాలకు పర్మిషన్ ఏవిధంగా ఇస్తున్నారో తెలియడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

కోరెడ్ల రమాప్రభ గెలుపునకు విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ గాజువాకలో విస్తృత ప్రచారం సాగింది. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, సిపిఐ కార్యదర్శి కె.సత్యనారాయణ, చిన్నగంటాడ కార్యదర్శి విష్ణు, సిపిఎం జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, సీనియర్ నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్, ఐద్వా నాయకులు కె.సంతోషం, జి.లక్ష్మి, ఎం.శ్రీదేవి, సిఐటియు నాయకులు లక్ష్మణరావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

స్టీల్‌ప్లాంట్ రక్షణకై పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ అభ్యర్థించారు. గాజువాక సిఐటియు కార్యాలయంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు తమ అవసరాల నేపథ్యంలోనే ఈ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. చిత్తశుద్ధితో కూడిన మద్దతు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ఇస్తారని చెప్పారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణే ప్రధాన ధ్యేయయంగా పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతిస్తున్నామని తెలిపారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కర్మాగారం మనుగడ సాగించాలంటే సొంత గనులు కేటాయించడం తప్ప వేరొక మార్గం లేదన్నారు. గనుల కేటాయింపు కోసం పోరాటం చేయాలని, కోరెడ్ల రమాప్రభను గెలిపించడం ద్వారా పోరాటానికి బలం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు జిఆర్‌కె.నాయుడు, గల్లా శంకరరావు, సిహెచ్.సన్యాసిరావు, రాజబాబు, డేవిడ్, వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ గెలుపుతోనే ఉత్తరాంధ్ర సమస్యలకు పరిష్కారం

పాడేరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ గెలుపుతోనే ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమౌతుందని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స అన్నారు. మంగళవారం జీకే వీధిలో పర్యటించిన ఆయన కార్యకర్తలతో కలిసి పిడిఎఫ్ అభ్యర్థి ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ, గెలిపిస్తే అదిచేస్తాం, ఇది చేస్తాం అనే రాజకీయపార్టీలు, అభ్యర్థులు కంటే, జీవితాన్నే ఉద్యమంగా ఎంచుకుని దాదాపు పాతికేళ్లుగా ప్రజాక్షేత్రంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపిస్తే, చట్టసభల్లో సమస్యల పరిష్కారానికి మరింతగా పోరాడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వాలేవైనా ఉత్తరాంధ్రపై తీవ్ర వివక్ష చూపుతున్న పరిస్థితుల్లో ఈ ప్రాంత వాణిని చట్టసభల్లో వినిపించాలంటే సేవాదృక్పథం, పోరాటపటిమ ఉన్న రమాప్రభను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విషయాన్ని విద్యావంతులు, విజ్ఞులైన ఓటర్లు గుర్తెరిగి, విచక్షణతోఓటేసి పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్. అమ్మవారి దారకొండ సిపిఎం ఎంపిటిసి అంపురంగి బుజ్జిబాబు. గాలికొండ సూపర్ సర్పంచ్ రామారావు గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుముర్ల చంటిబాబు. మోహన్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స తదితరులు

లంబసింగిలో గిరిజన సంఘం విస్తృత ప్రచారం

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ ఆధ్వర్యంలో. మంగళవారం చింతపల్లి మండలం లంబసింగి పంచాయతీలో విస్తత ప్రచారం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, పలువురు ఉద్యోగ ఉపాధ్యాయులను కలిసి, కరపత్రాలను అందజేసి రమాప్రభకు ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. గిరిజన చట్టాలు, హక్కులపై దాడులు జరుగుతూ, మన్యవాసుల సంక్షేమం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యధోరణి నేపథ్యంలో నీతి నిజాయితీగా, సమాజం పట్ల చిత్తశుద్ధితో పనిచేసే కోరెడ్ల రమాప్రభ వంటి వారి గెలుపు ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో అప్రజాస్వామిక, అరాచక పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలంటే చట్టసభల్లో పిడిఎఫ్ బలం పెరగాల్సిన అవసరం ఉందని, అది రమాప్రభ గెలుపుతోనే సాకారమౌతుందన్నారు.

రమాప్రభ గెలుపుతో వైసిపికి గుణపాఠం

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభను గెలిపించి అధికార వైసిపి గుణపాఠం చెప్పాలని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సాగిన చిరంజీవితో కలిసి పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రమాప్రభను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఆమె పోరాటం, కృషి కొనసాగుతుందన్నారు. విభజన హామీల అమలు, ఉత్తరాంధ్ర సమస్యల పరిష్కారానికి రమాప్రభ గెలుపు ఎంతో అవసరమన్నారు.

జి మాడుగుల : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ విజయాన్ని కాంక్షిస్తూ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల, గాంధీనగర్ బాలికల స్కూల్‌లో ఉపాధ్యాయులు, కాంట్రాక్టు ఉద్యోగులు, సిఆర్‌టిలతో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, సిఐటియు మండల కార్యదర్శి జగ్గంజర దీనబంధు సమావేశం నిర్వహించి ఓటేయాలని అభ్యర్థించారు. సమావేశంలో ఉపాధ్యాయులు గిరిజన సంఘం నాయకులు సాగిన వీరన్న పడాల్, కోటేశ్వరరావు, ధర్మారావు, శ్రీకాంత్, దేవి నాయుడు పాల్గొన్నారు

బడ్జెట్ స్కూళ్ల మనుగడకు రమాప్రభని గెలిపించాలి : మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

గాజువాక : బడ్జెట్ స్కూల్స్ మనుగడ సాగించాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. రమాప్రభకు మద్దతుగా గాజువాక ఇండస్ట్రీస్ ఏరియా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన యశోద స్కూల్లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీతి, నిజాయతీ, ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసే రమాప్రభను గెలిపించాలని కోరారు. నూతన విద్యా విధానం వల్ల బడ్జెట్ స్కూళ్లకు నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. దాన్ని తిప్పికొట్టే సామర్థ్యం రమాప్రభకు ఉందన్నారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ, కరోనాకాలంలో నష్టాలు ఎదుర్కొన్న బడ్జెట్ పాఠశాలలకు ఆస్తి పన్ను మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిప్సా నాయకులు భాస్కరరావు, శ్రీనివాసరావు, పాలూరు లక్ష్మణస్వామి, డి.శ్రీనివాస్, ఎస్‌వికె.పరుశురాం, సిఐటియు నాయకులు ఎం.రాంబాబు, ఎ.లోకేష్, కిరీటం, సంతోషం, పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొని మద్దతు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

డుంబ్రిగూడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థికోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మంగళవారం మండలంలోని మారుమూల సాగర, సొవ్వ, గసభ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో గిరిజన సంఘం, సిఐటియు నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, గిరిజన సంఘం నాయకులు టి.సూర్యనారాయణ పి.సురేష్‌కుమార్, పి సత్యనారాయణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో (పిడిఎఫ్ అభ్యర్థిని డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోనివిస్తత ప్రచారం నిర్వహించారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 250 ప్రజా సంఘాలు మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ పోటీ చేస్తున్నారని ఆమెకు అందరూ మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో గిరిజన సంఘం కార్యదర్శి పి రామన్న పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆర్.రాము మంగళవారం అచ్యుతాపురంలోని పలు కార్యాలయాలు, కళాశాలలు, హాస్పిటల్స్, ప్రైవేట్ పాఠశాలలు, బ్యాంకుల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కోరెడ్ల రమాప్రభను 250 ప్రజాసంఘాలు బలపర్చినట్లు చెప్పారు.

చోడవరం : డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ చోడవరం మండలంలో సీఐటీయూ, డివైఎఫ్ఐ, రైతు సంఘం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటికి తిరిగి విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి.నాయుడు, శ్రీను, కళ్యాణ్, రైతు నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, వై.గణేష్ పాల్గొన్నారు.

సబ్బవరం : కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మండలంలోని వంగలి, అమృతపురం, సబ్బవరం, అంతకాపల్లి గ్రామాల్లో మంగళవారం ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ఆధ్వర్యాన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలపై శాసన మండలిలో పోరాడే కోరెడ్ల రమాప్రభను ప్రజాసంఘాలు బలపర్చాయని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జక్కాన సత్యనారాయణ, జక్కాన రాము, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పాడ సత్యవతి, ఊడి బాలకృష్ణ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరించిన సిపిఐ నాయకులు

అనకాపల్లి : ఉత్తరాంధ్ర ప్రజా సమస్యలపైనా, ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అవగాహన ఉన్న, పోరాడే 250 ప్రజా సంఘాల మద్దతుతో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిపిఐ నాయకులు కోరారు. ఈ మేరకు సిపిఐ కార్యాలయంలో మంగళవారం రమాప్రభ బయోడేటా బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం, మాజీ మున్సిపల్ కార్పొరేటర్ తాకాసి వెంకటేశ్వరరావు, శ్రీరామదాసు అబ్బులు, కోరిబిల్లి శంకర్రావు, ముక్కామల చిన్ని, కె.వెంకటరమణ పాల్గొన్నారు.



అరకులో ప్రచారం...



గిరిజన రైతులకు పశువులను అందిస్తున్న అధికారులు

పిడుగుపాటు బాధితులకు సాయం

సింహాచలం గోశాల నుంచి పశువులు అందజేత

33 మందికి రూ.4.50 కోట్ల విలువైన 150 పాడి పశువులు

కలెక్టర్, ఎస్‌పి చొరవ, దేవస్థానం ఔదార్యంపై లబ్ధిదారుల హర్షం

ప్రజాశక్తి -పాడేరు: పిడుగుపాటుకు పశువులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత గిరిజన రైతులకు మంగళవారం పాడిపశువులను అందజేశారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి సతీష్ కుమార్ చొరవ, సింహాచలం వరాహ నృసింహస్వామి దేవస్థానం ఔదార్యంతో వారికి సాయం లభించింది. సింహాచలం గోశాల ఆవరణలో ఆధార్ ఆధారంగా బాధిత రైతులకు రూ.4.50 కోట్ల విలువగల 150 పశువులను వాటికి రెండు నెలలకు సరిపడా పశు దాణాను అందజేసి దేవస్థానం వారు ఉదారతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే..
గతేడాది పిడుగుపాటుకు పెదబయలు మండలం కొరవంగి పంచాయతీ చింతలవీధి, లింగేటి పంచాయతీ ఒనకొత్తూరు, ఇంజరి పంచాయతీ జమదంగి, ఇంజరి గ్రామాల్లో సుమారు 150 పశువులు మృతి చెందాయి. దీంతో 33 బాధిత కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లి దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ నుండి ఎటువంటి సాయం అందని పరిస్థితుల్లో బాధితులకు ఏదో రూపంలో సాయం చేయాలన్న ఆశయంతో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్‌పి సతీష్ కుమార్ సింహాచలం వరహనృసింహ స్వామి దేవస్థానానికి లేఖరాసి, గిరిజనులకు పశువులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన దేవస్థానం అధికారులు సోమవారం ఆధార్ ఆధారంగా లబ్ధిదారుల డాక్యుమెంటేషన్ పూర్తి చేశారు. చింతలవీధిలో 11 మంది, ఇంజరిలో నలుగురు, జమదంగిలో 13 మంది, వనకొత్తూరులో ఐదుగురు లబ్దిదారులు సింహాచలం దేవస్థానం గోశాల నుండి పశువులను రప్పించి, 33 మంది లబ్దిదారులకు 150 పశువులను అందించారు. కలెక్టర్ ఏర్పాటు చేసిన వాహనాల్లో ఆయా పశువులను లబ్ధిదారుల గ్రామాలకు తరలించి అందజేశారు. కలెక్టర్, ఎస్‌పి చొరవను సింహాచలం దేవస్థానం ఔదార్యాన్ని, దేవస్థానం ట్రస్టీ దినేష్‌రాజు, ఆలయ ఇఒ ఉదారతను లబ్ధిదారులు ప్రశంసిస్తూ వారికి ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో వెటర్నరీ ఎడి డాక్టర్ రాజా రవికుమార్, డిఎస్‌పి వెంకటరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

27 మందిపై బైండోవర్

ప్రజాశక్తి - జిమాడుగుల: మండలంలోని కుమ్మిడి సింగి, దిగరాపల్లి గ్రామాల్లో నాటుసారా తయారుచేసిన, విక్రయించిన 27 మందిని గుర్తించి, వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చట్టరీత్యా నేరమని పదేపదే హెచ్చరిస్తున్నా అదే పనికి పూనుకుంటుండడంతో వారిని గుర్తించి బైండోవర్ చేశామని, ముందుందు సారా తయారీ, అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు, కేసులు తప్పవని హెచ్చరించారు.

అన్ని అనుమతులతోనే మైనింగ్

ప్రజాశక్తి -అనంతగిరి : నిమ్మలపాడు కాల్‌సైట్ మైనింగ్ తవ్వకాలు అన్ని అనుమతులతోనే జరుగుతున్నాయని, దీన్ని రాజకీయం చేయడం తగదని మైనింగ్ లీజుదారుడు రొబ్బ శంకరరావు, దురియ. రుక్మిణి స్పష్టం చేశారు. ఎపిఎండిసితో ఒప్పందం కుదుర్చుకుని, వారి అనుమతితోనే తవ్వకాలు చేపడుతున్నామని, దీనికి రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ కుంబా రవిబాబుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. టిడిపి నేతలు రాజకీయ దురుద్దేశ్యంతోనే అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారన్నారు. రైతులకు పరిహారం, కూలీలకు డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లిస్తూనే ఉన్నామన్నారు.



లక్కీడ్రా విజేతలను ప్రకటిస్తున్న జ్యూయలరీ నిర్వాహకులు

భీమా జ్యూయలరీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భీమా జ్యూయలరీ లక్కీ డ్రా విజేతలకు సంస్థ చైర్మన్ బి.గోవిందన్ బహుమతులు అందజేశారు. తమ జ్యూయలరీ సంస్థను 1925లో వ్యవస్థాపకులు లక్ష్మీ నారాయణ బట్టర్ అలెప్పి (కేరళ)లో ప్రారంభించగా అంచెలంచెలుగా ఎదుగుతూ విశాఖలో గత ఏడాది అక్టోబర్ 2న ఘనంగా ప్రారంభమైందన్నారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రా విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మీ నారాయణ బట్టర్ కుమారుడు ప్రస్తుత చైర్మన్ డాక్టర్ బి.గోవిందన్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. లక్కీ డ్రాలో మొదటి బహుమతి విజేత సిహెచ్.మేఘనకు హోండా యాక్టివా, రెండో బహుమతి విజేత ఎస్ఎస్ఎ శాస్త్రికి శాంసంగ్ రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి విజేత హరీష్ పాత్రునికి ఎల్ఇడి టీవీ అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవిందన్ మాట్లాడుతూ భీమా జ్యూయలరీని విశాఖలో ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇంత మంచి ఆదరణ లభించడానికి కారణం ఆభరణాల ప్రత్యేకతేనని అన్నారు. వ్యాపారంలో 97 ఏళ్ల అనుభవం, ఆభరణాల తయారీలో 30 సంవత్సరాల అనుభవం కలిగిన నిపుణులతో కలిసి పయనిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సిఇఒ రోహిత్ కృష్ణ, ఫైనాన్స్ హెడ్ ఆర్.శ్రీనివాస్, విశాఖ బ్రాంచ్ మేనేజర్, సహాయ బ్రాంచ్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

- సిఎంకు ప్రొఫెసర్ చలం లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో జోనల్ వ్యవస్థ అమలు చేయాలని, ఆర్టికల్ 371 డి ప్రకారం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాజీ విసి, యుపిఎస్‌సి పూర్వ సభ్యులు ఆచార్య కెఎస్.చలం లేఖ రాశారు. ఆ వివరాలను ఆయన మీడియాకు మంగళవారం వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం శుభపరిణామన్నారు. ఇదే సందర్భంలో ఉత్తరాంధ్రలో వలసలను ప్రస్తావించారు. ఉత్తరాంధ్రలో జరుగుతున్న పారిశ్రామికీకరణ ఈ ప్రాంత ప్రజల వలసలను ఆపలేకపోయిందన్నారు. డిగ్రీలు చదువుకున్న విద్యార్థులు కూడా వలసలు పోతున్నారని తెలిపారు. స్థానికంగా లభిస్తున్న ఉద్యోగాలలో ఎక్కువ మొత్తాన్ని ఇతర ప్రాంతాల వారు ఎగరేసుకుపోతున్నారని, స్థానికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని లేఖలో పేర్కొన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలో 371డిని చేర్చి ప్రాంతీయ మండళ్ల ఉద్యోగాల్లో స్థానికులకు వెసులుబాటు కల్పించిందని, మన రాష్ట్రం విడిపోయిన తరువాత కూడా ఈ నిబంధనను ఉంచారని ప్రస్తావించారు. స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు అన్న హామీ అమలు కోసం ఉత్తరాంధ్ర యువత ఎదురు చూస్తోందని తెలిపారు.

సురక్షిత బాల్యం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : బాల వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన సురక్షిత బాల్యం - బాలిక హక్కు అనే పోస్టర్‌ను ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు మంగళవారం బీచ్ రోడ్‌లోని బ్రిడ్జి స్కూల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమణి కుమారి, లక్ష్మి, శ్రీదేవి, దీప్తి పాల్గొన్నారు.

విక్రమ్‌కు వైవి.సుబ్బారెడ్డి అభినందన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు వైసిపి యూత్ వింగ్ జోనల్ ఇన్‌ఛార్జిగా నియమితులైన అవనాపు విక్రమ్‌ను టిటిడి చైర్మన్, పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి అభినందించారు. విక్రమ్ మంగళవారం మర్యాదపూర్వకంగా సుబ్బారెడ్డిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు.

అక్రమాస్తులపైనా ఖాకీల ఆరా !

'ఎకానమీ చిరంజీవిరావు' మెడకు నిఘా నివేదిక ఉచ్చు చుట్టుకోనుందా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఎన్నికల ముందా ? ఎన్నికలయ్యాకా ? ఎప్పుడన్నది స్పష్టత లేకపోయినా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి నుంచి బరిలో ఉన్న వేపాడ (ఎకానమీ) చిరంజీవిరావుపై ఖాకీ లాఠీ వేలాడుతుందనే చెప్పాలి. ఇటీవల అక్రమ డబ్బుతో పాటు పట్టుబడ్డ ఆయనకు చెందిన డైరీలో పలు ఆర్థిక లావాదేవీల చిట్టా అంతా పూసగుచ్చినట్లు ఖాకీలకు లభ్యం అయ్యిందనడంలో సందేహం లేదు. దీంతో ఖాకీల నిఘా నివేదిక ఆయన చుట్టూ బలంగా అల్లుకుంటోంది. గతంలో 'ఎకానమీ చిరంజీవిరావు' ఎక్కడెక్కడ విధులు (పాఠాలు) ఎలా (చెప్పారు) నిర్వహించారు ? వచ్చిన ఆరోపణలేంటి ? అన్న అంశాలను దర్యాప్తులో అంశంగా చేర్చారు.



చిరంజీవి (ఫైల్ ఫొటో)

ఉమ్మడి విశాఖ జిల్లాలోని సబ్బవరంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం చేస్తూ బయట విద్యావేత్తగా ఎకానమీ (ఆర్థిక వ్యవస్థ)పై క్లాసులు ప్రైవేట్‌గా తీసుకుంటూ కాలేజీకి ఎగనామం పెట్టిన తీరు, తెన్నూ ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 2016 నుంచి 2022 వరకూ అక్రమంగా సంపాదించిన రూ.కోట్ల సంపదపైనా.. గతంలో విశాఖ నగరం, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో ఒక బ్యాచ్‌కి రూ.25 లక్షలు చొప్పున ఏడాదికి 12 బ్యాచ్‌లకు రూ.3 కోట్లకు పైగా సంపాదించిన అక్రమాస్తుల గురించిన వాకబు చేస్తున్నారు. పేద, దళిత, గిరిజన, బిసి నిరుద్యోగ విద్యార్థులను దగా చేసి వారికి సకాలంలో కోచింగ్ ఇవ్వకుండా కూడబెట్టిన అక్రమ సంపాదనపైనా గురిపెట్టారు. ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసే వరకూ సంపాదన వ్యవహారాలను ఇంటెలిజెన్స్ అధికారులు సిద్ధం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. తాను విద్యావేత్తనని, తనకు నిరుద్యోగ పట్టభద్రులంతా ఉత్తరాంధ్ర శాసన మండలి ఎన్నికల్లో ఓట్లేయాలని తాజాగా ఆయన ప్రచారం చేసుకోవడం, అదే క్రమంలో అవినీతి, అక్రమ ఆరోపణలు వెల్లువెత్తుతుండటం ఇప్పుడు ఉత్తరాంధ్రలో హాట్ టాపిక్‌గా ఉంది.

ఆయన తీరుపై నిరుద్యోగుల నుంచే పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార వైసిపిపై ప్రజల్లో పలు అంశాలపై అసంతృప్తి వ్యక్తమవుతున్న తరుణంలో తనను గెలిపిస్తే ఉత్తరాంధ్ర పట్టభద్రుల కోర్కెలు నెరవేర్చుతానంటూ నమ్మబలికే యత్నాలకు టిడిపి యంత్రాంగం దిగుతోంది. ఉత్తరాంధ్ర జిల్లాల సమస్యలపై సిపిఎం, ప్రజాసంఘాలు ఎప్పటి నుంచో పోరాడుతున్న సంగతిని ఈ ప్రాంతంలోని వివిధ తరగతుల ప్రజానీకం, అభ్యుదయవాదులు, మేధావులంతా కొనియాడుతున్న నేపథ్యంలో 'విద్యావేత్త' ముసుగులో సదరు ఎకానమీ చిరంజీవిరావు ఓట్లడుగుతుండడం విడ్డూరమైన విషయమే. పిడిఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలబడ్డ డాక్టర్ కోరెడ్ల రమాప్రభ వైపునకు ఉత్తరాంధ్ర ప్రజానీకం, పట్టభద్రులు, మేధావులు చూస్తున్నారు. ఆమెది 'విలక్షణమైన అభ్యర్థిత్వం' అంటూ కొనియాడుతున్నారు. చట్టసభల్లోనూ, బయటా నిజమైన పోరాటాల వారసత్వంగల పిడిఎఫ్‌ను బలపరుస్తూ బ్రహ్మరథం పడుతున్నారు. వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ప్రభుత్వంపైగల వ్యతిరేకత పిడిఎఫ్‌కు కలిసొచ్చే అంశంగా ఉంది.

విద్యావేత్త భూస్వామిగా ఎలా మారారు ?

తన అక్రమార్జనతో చిరంజీవిరావు భూములు కొనుగోలు చేసిన వైనంపైనా విశాఖ జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. ఒక్కొక్కటీ ఆరా తీసి బయటకు లాగుతూ నివేదిక తయారు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని పారిశ్రామికవాడలో 20 ఎకరాలకుపైగా, విజయనగరం జిల్లా అలమండలో సుమారు 15 ఎకరాలు, కొమ్మాది, ఎంవిపి, ఉషోదయ జంక్షన్, పెందుర్తిలలో కొన్ని చోట్ల వందల గజాల భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించి ఆ దిశగా విచారణ కొనసాగిస్తున్నారు.

వైసిపి అధికార దుర్వినియోగానికి అడ్డుకట్టవేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలలో వైసిపి అధికార దుర్వినియోగానికి ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట వేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్నికోడ్ ఉల్లంఘనలపై పలుసార్లు ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంగళవారం విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన మండలి ఎన్నికలో వైసిపి బరితెగించి వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, వాలంటీర్ల వ్యవస్థను తమ అభ్యర్థి గెలుపు కోసం వాడుకుంటోందన్నారు. పలు సందర్భాలలో వీటిపై జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోయి వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, సర్వశిక్ష అధికారులు, ఆనందపురం ఎంఇఒపై తాము సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసినా వారిపై నేటికీ చర్య తీసుకోలేదన్నారు. ఎయు విసి వ్యవహారంలో తమకు దొరికిన సాక్ష్యాలు కూడా విచారణ అధికారికి దొరక్కపోవడం విడ్డూరంగా ఉందన్నారు. హోటల్‌లోని సిసి కెమెరాల ఫుటేజీలను వెంటనే తీసుకోవాలని తాము సూచించినా ఆ పని చేయలేదన్నారు. కావాలనే సాక్ష్యాలను తారుమారు చేయడం తప్పు చేసిన వారిని కాపాడడానికేనన్నారు. విచారణల పేరిట కాలయాపన జరపడం, విచారణను కూడా కింది స్థాయి అధికారులతో నామమాత్రంగా చేయించడంతో అధికార పార్టీ తన పని తాను చేసుకుపోతోందన్నారు. ఈలోగా ఎన్నికలు పూర్తయ్యే అవకాశముందన్నారు. ప్రభుత్వం జీతాలు చెల్లించే వాలంటీర్ల వ్యవస్థను తన పార్టీ జేబు సంస్థగా మార్చేసిందని ఆరోపించారు. దొంగ ఓట్లు చేర్పించడం, నామినేషన్‌కు ప్రజలను తరలించడం, పట్టభద్రులతో సమావేశాలు నిర్వహించడం వంటి పనులన్నింటికీ వీరిని వైసిపి వాడుకుంటోందన్నారు. ఇలా చేయడం అనుమతించరాదని తాము ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లా కలెక్టరుకు ఈ నెల 2న ఆదేశాలిచ్చారన్నారు. అయినా అవేవీ ఆగడంలేదన్నారు. తాజాగా 5వ తేదీన 3 గంటలకు జివిఎంసి 16వ వార్డులో అధికార పార్టీ వారు ఎన్నికల నిబంధన ఉల్లంఘించి సమావేశం నిర్వహిస్తున్నారని, తక్షణం ఆపాలని ఆ రోజు ఉదయం లిఖిత పూర్వకంగా తాము తెలిపినా కలెక్టర్ పట్టించుకోలేదన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే తమ ఓటమి ఖాయమని తెలిసే వైసిపి ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు. అధికార దుర్వినియోగాన్ని అరికట్టాలని, సంబంధిత అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని తాము మంగళవారమూ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసినట్టు అజశర్మ వెల్లడించారు. విజ్ఞులైన ఉత్తరాంధ్ర పట్టభద్రులు అధికార పార్టీ ఉల్లంఘనలు, అడ్డదారులు, అక్రమాలను గుర్తెరిగి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, నిజాయతీగా, నిబద్ధతగా, నిస్వార్థంగా పని చేస్తున్న 250 ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



నృత్యాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫేర్వెల్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. రామన్న పడాల్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసి పాఠశాలను విడిచిపెడుతున్న సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలుకుతూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఐదేళ్ల పాటు ఇక్కడ విద్యాబుద్ధులు నేర్చుకొని పాఠశాల విడిచి వెళ్లడం ఎంతో బాధగా ఉంటుందని, అయితే ఉన్నత చదువులు నిమిత్తం తప్పదని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు వన్నె తేవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. సాంస్కృతి కార్యక్రమాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. విద్యార్థులకు నృత్యాల్లో తర్ఫీదు ఇచ్చిన జాన్, అవినాష్, విశ్వనాధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్ ఉపాధ్యాయులు వి.భగీరథ, వి.లలి కుమారి, సిహెచ్.శిరీష, ఆర్. ప్రసాదరావు, కె.వెంకటరత్నం, ఎ.గాసన్న, ఎస్.రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

జిఐఎస్‌లోని ఎంఒయుల అమలుకు చర్యలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల విలువైన ఎంఒయులు కుదుర్చుకున్నామని, 6.30 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళిక త్వరలో రాష్ట్రంలో అమలు కానుందని వైసిపి రాష్ట్ర నాయకులు వైవి.సుబ్బారెడ్డి వెల్లడించారు. మంగళవారం నగరంలోని గ్రాండ్‌బే హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తమ ప్రభుత్వం అన్ని తరగతుల ప్రజానీకం సంక్షేమం చూడడంలో జన హృదయాల్లో స్థానం సంపాదించిందన్నారు. పరిపాలన రాజధాని విశాఖేనని, త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇక్కడ నుంచే ప్రారంభం కానుందని అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉత్తరాంధ్ర శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. పార్లమెంట్ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో బిసిల పాత్ర 65 శాతం మేర జగన్ పాలనలో పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సీతంరాజు సుధాకర్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, కెకెరాజు, అదీప్‌రాజు, కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర ప్రశంసనీయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమాజ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత ప్రశంసనీయమని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కొనియాడారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో సేవలందించిన వారితో పాటు ముగ్గులు, పాటల పోటీలలో విజేతలుగా నిలిచిన వారిని, అతిథులను ఫోరమ్ తరపున సత్కరించారు. వేడుకల్లో శాసన మండలి సభ్యురాలు వరుదు కళ్యాణి. జిసిసి చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి, బ్రహ్మ కుమారీస్ ప్రతినిధి రామేశ్వరి పాల్గొన్నారు. మహిళల గొప్పతనాన్ని చాటిచెప్పారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మహిళా చట్టాలను సమగ్రంగా అమలు చేయాలని మహిళా చేతన కార్యదర్శి కత్తి పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన, అనంతరం సభ నిర్వహించారు.